# పురోహితప్రపంచం

"వయం రాష్ట్రే జాగృయామ పురోహితాః" - (శుక్ల యజుర్వేదం 9-23)

దేశం మేలు కోరేవారయిన మనం జాగరూకులై (మేల్కొని) ఉందుముగాక.

## డా. కె. అరవిందరావు

ఎమెస్కో

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | మన ధర్మాన్ని ఎందుకు కాపాడుకోవాలి? | 15 |
| 2. | మన ఋషుల బోధనా ప్రణాళిక | 19 |
| 3. | సంస్కృతం ఎందుకు? | 23 |
| 4. | తెలుగులో యాభైశాతం సంస్కృతమే | 26 |
| 5. | లోకహితం కోరేవాడు పురోహితుడు | 31 |
| 6. | గాయత్రీ మంత్రం | 37 |
| 7. | దేవుడు పురుషుడా, స్త్రీయా, సామ్రాజ్యవాదియా? | 40 |
| 8. | జీవులందరూ భగవంతుని రూపాలే | 45 |
| 9. | బ్రహ్మము వేరు, బ్రహ్మదేవుడు వేరు | 52 |
| 10. | విగ్రహారాధన | 57 |
| 11. | పూజలు – వ్రతాలు | 63 |
| 12. | భగవంతునికి అర్పించే దృష్టితో పనుల్ని చేయడం | 69 |
| 13. | మనకున్న మూడు ఋణాలు | 76 |
| 14. | సంకల్పము – ప్రవర | 81 |
| 15. | అర్థవాదాలు | 87 |
| 16. | ముప్పైమూడు కోట్ల దేవతలు | 92 |
| 17. | దేవతార్చన | 95 |
| 18. | పూజలు – నమస్కారాలు | 102 |
| 19. | మూడు గుణాలు – నాలుగు వర్ణాలు | 109 |
| 20. | సృష్టిని గూర్చి యజుర్వేదం ఇలా అంటుంది | 116 |
| 21. | ధర్మశాస్త్రాలు | 120 |
| 22. | కాలం విలువ | 126 |

23. పురుషార్థాలు 130

24. భగవద్గీత 136

25. క్షీరసాగరమథనం 143

26. జ్ఞానం విలువ 146

27. స్వర్గం వేరు మోక్షం వేరు 151

28. కొన్ని పదాలు – అర్థాలు 155

29. సమాజహితము – ఆత్మహితము 162

## 1

# మన ధర్మాన్ని ఎందుకు కాపాడుకోవాలి?

**సం**స్కృతంలో 'మను' అనే ధాతువు నుంచి ఏర్పడిన మతం అనే పదానికి 'అభిప్రాయం' అని అర్థం. భగవద్గీతలో చాలచోట్ల శ్రీకృష్ణుడు ఇది నా అభిప్రాయం అని చెప్పడానికి 'మమ మతం' అంటాడు. ఇంగ్లీషులో రిలిజియన్ అనే పదానికి భారతీయ భాషల్లో వివిధ అనువాదాలున్నాయి. హిందీ రాష్ట్రాలలో 'ధర్మ్' అంటారు. తెలుగు భాషలో భగవంతుని గూర్చి మనకున్న అభిప్రాయాన్ని, సిద్ధాంతాన్ని, నమ్మకాల్ని అన్నింటినీ కలిపి మతం అని వ్యవహరిస్తున్నాం.

ప్రపంచచరిత్ర గమనిస్తే అనాదిగా వివిధ వర్గాల ప్రజలు యుద్ధాల్లో మునిగి తేలడం గమనిస్తాం. కొన్ని యుద్ధాలు రాజ్యాన్ని విస్తరించడానికైతే, మరికొన్ని యుద్ధాలు మతాన్ని విస్తరించడానికి. చాల సందర్భాల్లో మతమూ, రాజ్యమూ రెండూ ప్రధానంగా ఉంటాయి. దేవుడు అనే వ్యక్తిని చూసిన మనిషి ఎవరూ లేకున్నా 'మా దేవుడే నిజమైన దేవుడు, అతన్నే ప్రపంచమంతా అంగీకరించాలి' అనే వాదనతో దాదాపు రెండువేల సంవత్సరాలుగా ప్రపంచంలో ఘర్షణలు నడుస్తున్నాయి. దాదాపు వేయి సంవత్సరాలుగా భారతదేశం ఇలాంటి ఘర్షణలకు, ఆక్రమణలకు, యుద్ధాలకు వేదిక అయింది. క్రీ.శ. 10వ శతాబ్దం నుండి ఇస్లాం మన దేశానికి రాగా, 16వ శతాబ్దం నుండి యూరోపియన్ వ్యాపారులు క్రైస్తవమతాన్ని తీసుకొచ్చారు. ఈ రెండు మతాలూ అనేక వ్యూహాలతో తమ మతాన్ని విస్తరించడానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. వీటిని గూర్చి మనం చరిత్రలో చదువుతుంటాం.

ప్రపంచంలోని అతి పెద్దమతాలైన క్రైస్తవం, ఇస్లాం మధ్య క్రీ.శ. 10వ శతాబ్దం నుండి 'పవిత్ర యుద్ధాలు' అనే పేరిట యుద్ధాలు జరుగుతున్నాయి. ఈనాటికీ వివిధ రూపాల్లో కొనసాగుతున్నాయి. ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోని అనేక దేశాల్లో ఈ మతాల అనుయాయుల మధ్య మారణకాండలు జరుగుతున్నాయి. దేవుడి కోసం హత్యలు, గృహదహనాలు మనదేశంలో కూడా చూస్తున్నాం.

మన మతాన్ని హిందూమతం అని ఈనాడు వ్యవహరిస్తున్నాం. ప్రాచీన గ్రంథాల్లో దీనిని 'సనాతనధర్మం' అన్నారు. సనాతన అంటే పాతది అని అర్థం కాదు, శాశ్వతమైనది అని అర్థం. దీనికి మూలాలు వేదాలు. ఇవి మన అత్యంత ప్రాచీన గ్రంథాలు. భగవంతుని నిఃశ్వాసరూపంలో వెలువడ్డాయని మన సంప్రదాయం తెలుపుతుంది. ఆధునికులు మాత్రం ఇవి సుమారు ఐదువేల సంవత్సరాల క్రితం గ్రంథాలని చెపుతారు. ఈ వేదాల్ని దర్శించిన మహర్షులకు ఏదో మతాన్ని స్థాపించాలని కానీ, రాజ్యాన్ని విస్తరింపజేయాలనే కాంక్ష కానీ లేవు. కేవలం సత్యాన్వేషణ వీరి ఉద్దేశం. ఈ విశ్వానికంతటికీ మూలకారణం ఏమిటి, దీన్ని పరిశీలిస్తున్న నా స్వరూపమేమిటి, ఈ విశ్వానికీ, నాకూ ఉన్న సంబంధం ఎలాంటిది – మొదలైన ప్రశ్నల్ని సంధించుకుని శాస్త్రీయంగా విచారణ చేశారు.

ఉదాహరణకు – తైత్తిరీయోపనిషత్తులోని ఒక సన్నివేశంలో భృగువు అనే ఒక జిజ్ఞాసువు (తెలుసుకోవాలనే కోరిక కలవాడు) బ్రహ్మవేత్త అయిన తన తండ్రి దగ్గరకు వెళ్ళి "బ్రహ్మను గూర్చి నాకు తెల్పండి" అని ప్రార్థిస్తాడు. తండ్రి వరుణుడు అనే ఋషి. అతడు బ్రహ్మవేత్త అయినప్పటికీ "నేరుగా బ్రహ్మ అంటే ఫలానా అని చెప్పడం సాధ్యం కాదు, నీవు సొంతంగా ఆలోచించి తెలుసుకోవాలి" అన్నాడు. ఎలా ఆలోచించాలి అనే విధానాన్ని కూడా చెప్పాడు. "నీవు ఆలోచించడానికి నీ వద్ద ఉన్న సాధనాలు మనస్సు, ఇంద్రియాలు, శరీరము. ఇవి ఎలా వచ్చాయి, ప్రకృతిపై ఎలా ఆధారపడి ఉన్నాయి? నీవు కేవలం శరీరం, మనస్సు, ఇంద్రియాలు మాత్రమేనా అనే విషయాలపై ఆలోచించి నాకు తెల్పు" అంటాడు. భృగువు కూడా అలాగే ఆలోచించి మొట్టమొదటగా 'స్థూలశరీరమే నేను' అనే అభిప్రాయానికి వస్తాడు. "మళ్ళీ ఆలోచించు" అని తండ్రి అన్నాడు. అతను మళ్ళీ ఆలోచించి 'శరీరంలో ఉన్న ప్రాణశక్తి నేను' అన్నాడు. "మళ్ళీ ఆలోచించు" అని తండ్రి ఆదేశం. మళ్ళీ ఆలోచించగా 'మనస్సు, ఇంద్రియాలు నా స్వరూపం' అనుకున్నాడు. అది కూడా కాదు అన్న తర్వాత 'అంచెలంచెలుగా ఆలోచించి స్థూలశరీరము, ప్రాణశక్తి, మనస్సు మొదలైన ఒక్కొక్కదాన్ని నిరాకరిస్తూ తన నిజమైన స్వరూపం చైతన్యం, లేదా తెలివి' అని తెలుసుకుంటాడు. ఈ చైతన్యానికి చావు, పుట్టుకలు లేవని వేదాంతశాస్త్రం వివరించి చెబుతుంది. కాలానికి అతీతంగా, విశ్వానికంతటికీ అతీతంగా వ్యాపించి ఉన్న చైతన్యమొక్కటే సత్యం అని తెలుసుకుంటాడు. ఈ సత్యానికే 'బ్రహ్మ' అని పేరు. తెలుగులో బ్రహ్మము అనవచ్చు. బ్రహ్మమొక్కటే అని అన్నమయ్య కూడా కీర్తించాడు. దీనినే పరమాత్మ అని కూడా అంటాం. ఇది దేవుడు అనబడే ఒక వ్యక్తి కాదు. దీన్ని పుంలింగంలోగానీ, స్త్రీలింగంలో కానీ వ్యవహరించరు. నపుంసక